# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు, రేపు రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు జరుగుతుంది.**
2. **జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ప్రారంభమైన తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు ఈరోజు కూడా కొనసాగనుంది.**
4. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**
5. **ఆసియా కప్ –2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన టీ20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు, రేపు రెండు రోజుల పాటు కలెక్టర్ల సదస్సు జరుగుతుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిస్తారని అధికారులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో ఈరోజు రాష్ట్ర స్థూల ఉత్పత్తి – జీఎస్డీపీపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

-------------------------

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో ముఖ్యమంత్రి హైదరాబాద్ లో నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు నిన్న ప్రారంభమైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడుతో పాటు, మహిళా సాధికారత పార్లమెంట్ కమిటీ

ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, పలువురు మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ,

వాయిస్..34 సెకన్లు

అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి సిహెచ్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ,

వాయిస్ .. 27 సెకన్లు

కాగా ఈరోజు కూడా ఈ సదస్సు కొనసాగనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని బస్‌స్టేషన్లు ఆధునికీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా బస్ స్టేషన్లు ఉండాలని ఆదేశించారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతి బస్సుకు ఛార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను – జీఎస్టీపై మార్పులు చేయడం పట్ల అనంతపురం జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయనికి అవసరమైన వస్తువులపై జీఎస్టీ తగ్గించడం శుభపరిణామని అనంతపురానికి చెందిన రైతు మురళి ఆకాశవాణికి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. సేవా పర్వ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న స్వచ్ఛభారత్ పై కథనాన్ని ఇప్పుడు విందాం..

వాయిస్ ఓవర్ (2:10 సెకన్లు)

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, పర్యాటకరంగానికి పారిశ్రామిక హోదా కల్పించడంతో 15 నెలల కాలంలో 10 వేల 644 కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని అన్నారు.

---------------------------

ఆసియా కప్ 2025లో భాగంగా దుబాయి ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగిన టీ20 క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 127 పరుగులను చేసింది. అనంతరం 128 పరుగుల లక్ష్యంతో బాటింగ్ చేసిన భారత జట్టు 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేయడంతో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

---------------------------

ఉత్తర తెలంగాణ దానికి ఆనుకుని ఉన్న విదర్భ ప్రాంతాలలో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలోనూ మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================